మంచం పట్టిన కాల్పోల్ తండా గిరిజనులు 8
తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామపంచాయతీ ముట్టడి 6
ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి 8
ఉర్దూఘర్ ఆవరణలో అక్రమ నిర్మాణాల కూల్చివేత 6



'కారు'లో.. నిస్తేజం!

» బీఆర్ఎస్‌లో సంధి కాలం
» పార్టీలో కనిపించని స్థానిక ఎన్నికల జోష్
» డీలాగా కార్యకర్తలు
» సంస్థాగత మార్పులు జరిగేనా?

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర కలిగిన బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తుతం సంధి కాలం నడుస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా ఉంది. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఇతర నాయకులు విమ ర్శలు చేస్తున్నా జిల్లా స్థాయిలో మాత్రం ఆ స్థాయి జోష్ కనిపించడం లేదు. రాష్ట్రంతో పాటు జిల్లాలోనూ జరుగుతున్న పరిణామాలు పార్టీ క్యాడర్‌లో అయోమయ పరిస్థితిని తలపిస్తున్నాయి. స్థానిక ఎన్నికలకు ముందు పార్టీ క్యాడర్‌ను క్షేత్రస్థాయిలో జిల్లాలో నడిపించే నాయకులే లేకపోవడంతో గ్రామస్థాయి కార్యకర్తల్లో నిస్తేజం నెలకొంది.

నిజామాబాద్, జూలై19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రస్థాయిలో నిత్యం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు జరుగుతుండగా జిల్లాలో మాత్రం ఏ ఒక్క బీఆర్ఎస్ నాయకులు స్పందించడం లేదు. ఇటీవల ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై పార్టీ క్యాడర్‌లో స్పందన లేకపోగా నియోజకవర్గ స్థాయిలో కూడా పార్టీ క్యాడర్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై, పార్టీ బలోపేతంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సామాన్య కార్యకర్త అసలు పార్టీలో ఏం జరుగుతుందోననే అయోమయ పరిస్థితిని కలగజేస్తోంది. గ్రామస్థాయి, మండలస్థాయి నేతలను పట్టించుకునే నాథుడే కరువవడంతో కిందిస్థాయి నేతలు అధికార కాంగ్రెస్‌వైపు మొగ్గుచూపుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, జిల్లాలో బలంగా ఉన్న బీజేపీ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతుండగా జిల్లాలో బీఆర్ఎస్‌లో మాత్రం ఇప్పటివరకు ఒక్క సమన్వయ సమావేశం నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే జిల్లాలో పార్టీ కనుమరుగయ్యే పరిస్థితి ఉందని పార్టీ క్యాడర్ ఆందోళన చెందుతోంది.

క్యాడర్‌లో నమ్మకం కలిగించే నేతలే కరువు

పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ జిల్లాలో బలంగా ఉండేది. పార్టీ ఆవిర్భావంలోనే జిల్లాపరిషత్‌ను కైవసం చేసుకున్న చరిత్ర కలిగిన బీఆర్ఎస్‌లో ప్రస్తుతం జిల్లాను ముందుండి నడిపించే నాయకుడే కరువయ్యాడు. గత శాసన సభ ఎన్నికలకు ముందు జిల్లాకు చెందిన మాజీ ప్రజాప్రతినిధిని జిల్లా అధ్యక్షుడిగా నియమించగా ఆ ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఒక్కరే గెలువగా మిగిలిన నాలుగు స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ మూడవస్థానంలో నిలిచింది. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీ డిపాజిట్‌ను కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు 19 నెలలు గడుస్తున్నా ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో ఎక్కడ కూడా నాయకులు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించలేకపోయారు. అప్పుడప్పుడు పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు ఒకటి రెండు కార్యక్రమాలు నిర్వహించినా జిల్లాస్థాయిలో మాత్రం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో బాల్కొండ నియోజకవర్గంలో మినహా పార్టీ క్యాడర్ ఎక్కడా కూడా బలంగా లేదు. నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాలలో స్థానిక సంస్థల ఎన్నికలు అధికార కాంగ్రెస్ - బీజేపీ మధ్యే భారీ అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నడిపించే నేత కోసం పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి.

సంస్థాగత మార్పులు జరిగేనా?

గత శాసనసభ ఎన్నికలకు ముందు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా మాజీ ప్రజాప్రతినిధిని పార్టీ అధిష్ఠానం నియమించగా ఆయన పనితీరు పట్ల పార్టీ అసంతృప్తిగా ఉందనే ప్రచారం జరుగుతుంది. జిల్లా బాధ్యుడిగా ఉన్న ఆయనను ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పార్టీ అధిష్ఠానం పరోక్ష సంకేతాలు ఇచ్చినట్లు జిల్లాలో ప్రచారం జరుగుతుంది. ఇటీవల పార్టీ సీనియర్ నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లోనూ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలు సిద్ధం కావాలని పిలుపునిచ్చినట్లు తెలుస్తుంది. ఆ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లాకు చెందిన రెండు నియోజకవర్గాల్లో పార్టీ ఇంచార్జిల మార్పు ఉండే అవకాశం ఉందని పరోక్ష సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తుంది. జిల్లాకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి, సీనియర్ నాయకుడికి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తులు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ లోపే ఈ మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి.

చుట్టపు చూపుగా వస్తున్న నేతలు

జిల్లాలో పదేళ్లపాటు నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలుగా ఉన్న కొంతమంది నేతలు గత ఎన్నికల్లో ఓటమిపాలయ్యాక నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బాల్కొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. నిజామాబాద్ రూరల్ (మిగతా 8లో..)





ధర్నా చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్, విద్యార్థి సంఘాల నాయకులు

గురుకుల విద్యార్థి ఆత్మహత్య

- ఫెయిల్ కావడంతోనే మనస్థాపానికి గురైనట్లు అనుమానాలు
- ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్ఎస్, విద్యార్థి సంఘాల ధర్నా



సంతోష్ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్, జూలై19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిప్రిరోడ్‌లో గల వేల్పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న గడ్డం సంతోష్ (17) శనివారం నర్సరీలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన సంతోష్ స్వగ్రామంలో పది వరకు చదివి, ఇంటర్ బైపీసీ కోసం గురుకుల పాఠశాలలో చేరాడు. ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షల్లో మూడు సబ్జెక్టులు ఫేయిల్ కాగా సప్లమెంటరీ పరీక్షలు రాశారు. ఇందులో సైతం ఫేయిల్ కాకపోవడంతో మనస్థాపానికి గురై ఉంటాడని పలువురు విద్యార్థులు తెలిపారు. షెడ్యూల్ కులాల హాస్టల్ వి ద్యార్థులు నర్సరీలోకి వాకింగ్ వెళ్లగా చెట్టుకు ఉరివేసుకున్న దృశ్యాన్ని చూసి కళాశాల సిబ్బందికి తెలియజేయడంతో ప్రిన్సిపాల్ సుదర్శన్‌తో పాటు సిబ్బంది వచ్చి గుర్తించి పోలీస్‌లకు సమాచారం అందించారు. దీం తో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఎస్‌హెచ్‌వో సత్యానారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సంతోష్ ఆత్మహత్యపై మృతుడి అన్న గడ్డం శీను తమ అ నుమానాలు ఉన్నాయని, ఇందులో ప్రిన్సిపాల్, పీఈటీల నిర్లక్ష్యం ఉందని పేర్కొంటూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఆసుపత్రి వద్ద ధర్నా

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీచైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావుతోపాటు వామపక్ష నాయకులు, విద్యార్థి సంఘాలు ధర్నాను చేపట్టారు. విద్యార్థి మృతిపట్ల రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ జడ్పీచైర్మన్ విఠల్‌రావు డిమాండ్ చేశారు. ఘటనా స్థలాన్ని, కళాశాలను విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ఆర్డీవో రాజాగౌడ్, గురుకులపాఠశాల జోనల్‌ఇన్‌చార్జి పూర్ణచందర్‌రావు పరిశీలించారు. విద్యార్థి మృతిపట్ల ఈయర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ మృతదేహాన్ని స్వగ్రామం పంపించేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు.

గురుకులాల్లో భయం భయం
• ఆర్మూర్‌లో గురుకుల కళాశాల విద్యార్థి ఆత్మహత్యకు కారణాలేంటి?
వివరాలు 7లో.......



మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ రాజయ్య

ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి

- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ రాజయ్య

నిజామాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ రాజయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు ఎం.రమేష్, సంకెపల్లి శ్రీధర్‌రెడ్డిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు వినయ్‌కృష్ణారెడ్డి, ఆశీష్ సంగ్వాన్‌లు ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థల పనితీరు గురించి చైర్మన్‌కు వివరించారు. మున్సిపల్, పట్టణాలు, జీపీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, తడిపొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధిపథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ద్వారా విడుదలైన నిధులు వాటి వెచ్చింపు వివరాలను గుణాంకాల ద్వారా వెల్లడించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూస్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ ఆదాయ వనరులను పెంపొందించే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకొని ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా (మిగతా 8లో..)



మలుపులు.. మృత్యు పిలుపులు!
» ప్రమాదకరంగా మూల మలుపులు
» నసురుల్లాబాద్‌లో ఆగని ప్రమాదాలు
» పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
7

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

- తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

డిచ్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సిలర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, కమిషన్ సభ్యులు ఎల్.విశ్వేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాలతో కలిసి మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో నెలకొన్న క్షేత్రస్థాయి విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తానని పేర్కొన్నారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల స్థితిగతులను కూడా తాను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందని, విద్యాభివృద్ధి కోసం రాష్ట్రంలో 20శాతం నిధులు కేటాయించాలని, ప్రైవేటు యూనివర్సిటీలకు విచ్చలవిడిగా అనుమతి ఇచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను పీజీ సెంటర్లుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్ ఉన్న ఇంజనీరింగ్ కోర్సులను రాష్ట్రంలో అనుమతించి పెట్టడం లేదన్నారు. ఖాళీగా ఉన్న 200కు పైగా అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని యూనివర్సిటీ టీచర్ ప్రొఫెసర్ అధ్యక్షుడు పున్నయ్య అన్నారు. అనంతరం యూనివర్సిటీలోని బాలికల హాస్టల్‌ను సందర్శించిన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని, కళాశాలను కూడా సందర్శించి విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. అనంతరం కళాశాల రాష్ట్ర సహాయ కార్యదర్శి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలతో కళాశాలలను కొనసాగించలేమన్నారు. దోస్త్ సిస్టమ్ లాంటి అడ్మిషన్ నిబంధనలతో ప్రైవేటు కళాశాలలు మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. అకాడమిక్ (మిగతా 8లో..)



బాలికలతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్

కమ్యూనిస్టు పార్టీ అంటేే ప్రశ్నించే గొంతు

- ఎరుపురంగు చూస్తే మోదీకి భయం
- కార్పొరేట్ శక్తులకు కేంద్రప్రభుత్వం దాసోహం
- కగార్ ఆపకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు
- సీపీఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

నిజామాబాద్‌కల్చరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ అంటే ప్రజల పక్షాన ఉండి ప్రశ్నించే గొంతు అని, ఎరుపు రంగు అంటే ప్రధాని నరేంద్రమోదీకి భయమని సీపీఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని మున్నూరుకాపు కళ్యాణ మండపంలో పార్టీ జిల్లా 22వ మహాసభలను ఘనంగా నిర్వహించారు. మహాసభకు ఓమయ్య, రాజేశ్వర్, రాజన్న అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ హాజరయ్యారు. మహాసభలను పార్టీ సీనియర్ నాయకుడు కంజర భూమయ్య, నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. అమరులైన వారికి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పదేళ్లలో ఎన్నో కార్మిక చట్టాల్లో మార్పులు తెచ్చిందని అన్నారు. కొన్నిటిని అమలుపర్చగా మరికొన్నింటిని సీపీఐ పార్టీ ప్రజల, (మిగతా 8లో..)

వరుణా కరుణించవా!

- ఎండుతున్న పంటలు
- వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు
- ఆందోళనలో అన్నదాతలు



ఎండిన పొలంలో రైతు



దుక్కి దున్ని వదిలేసిన భూమి

ఇందల్వాయి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభమైన నెల గడిచినా వర్షాలు కురవడం లేదని వరి, మొక్కజొన్న, సోయాబిన్, పసుపు, పత్తి పంటలు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదనకు గురవుతున్నారు. వరుణదేవా కరుణించవా అంటూ ఆకాశం వైపు చూసున్నారు.

ప్రస్తుతం 7వేల ఎకరాల్లో పంటలు

మండలంలోని పలు గ్రామాల్లో పంటలను పండిస్తున్నారు. 6850 ఎకరాల్లో వరి, 150 ఎకరాల్లో మొక్కజొన్న, 130 ఎకరాల్లో సోయాబిన్, 30 ఎకరాల్లో పసుపు, 30 ఎకరాలో పత్తి పంటలను రైతులు పండిస్తున్నారు. పంటలు వేసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు వర్షాలు పడక చెరువులు నిండకపోవడంతో భూగర్భ జలాలు లేక ఉన్న బోర్లు ఎత్తివేయడంతో వేసిన పంటలు ఎండిపోయే దశకు చేరాయి.

రూ.లక్షల పెట్టుబడి ఖర్చు

వానాకాలం సాగు కోసం రైతులు ఇప్పటికే ఎకరానికి రూ.5వేల చొప్పున ఖర్చు చేసి పనులు మొదలు పెట్టారు. ట్రాక్టర్ సహాయంతో దుక్కులు దున్నివిత్తనాలు కొని కూలీల సహాయంతో పంటలు వేశారు. వర్షాలు కురవకపోతే నష్టాలు తప్పవంటూ విలపిస్తున్నారు.

వరి సాగుకే మొగ్గుచూపుతున్న రైతులు

మండలంలోని రైతులు వరిసాగుకే మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే 6,850 ఎకరాల్లో వరి పంటలను సాగు చేస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే వరి విస్తీర్ణం మరింత పెరగనుంది. గత ఏడాదిలో 13వేల ఎకరాల వరకు వరి పంటలు వేసిన రైతులు ఈ ఏడాది వర్షాలు లేక పూర్తిస్థాయిలో ఆలోచనలో పడ్డారు. పంటలు వేసిన వర్షాల్లేక ఎండిపోతుండడంతో (మిగతా 8లో..)

చదరంగంలో రాణిస్తున్న బుడతడు 7

తాగునీటి సమస్య తీర్చాలని గ్రామపంచాయతి ముట్టడి



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

భీమ్‌గల్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోన్‌గొప్పులలో శనివారం తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వందమంది మహిళలు గ్రామ పంచాయతీని ముట్టడించారు. ఖాళీబిందెలతో వచ్చి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో, రాంసింగ్ తండాలో సుమారు ఐదువందల కుటుంబాలున్నాయి. వీరికి రెండు నెలల నుంచి తాగడానికి మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని నినాదాలు చేశారు. అనంతరం తాగునీటి సమస్య తీర్చాలని ఎంపీవో జావీద్ అలీకి వినతిపత్రం అందజేశారు.

పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ అధికారి



పాఠశాల విద్యార్థులతో భోజనం చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

ఎడపల్లి, జూలై19(ఆంధ్ర జ్యోతి): ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న లాబ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోన్స్, బాల కృష్ణా రావు, ఉపాధ్యాయులు తదితరలు ఉన్నారు.

కుకునూర్ పాఠశాలలో బోనాల పండుగ



బోనాల పండుగ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేల్పూర్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి): కుకునూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహం వద్ద బోనాలను ఉంచి దూప, దీప నైవేద్యాలు సమర్పించి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు హరిచరణ్, హరిప్రసాద్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలకేంద్రంలోని శ్రీవిద్యాసాయి ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల విద్యార్థులు బోనాల వేడుకలను ఘనం జరుపుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, డైరెక్టర్ ఏనుగు ప్రమీళ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కోర్డినేటర్ జాన్ పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని శివతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పోతరాజుల వేషధారణ ధరించగా బాలికలు తలపై బోనాలను ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్, ఉపాధ్యాయులు రాజు, మమత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు బోనాల పండుగను జరుపుకున్నారు. బాలికలు బోనాలు ఎత్తుకోగా విద్యార్థులు విచిత్ర వేషదారణతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాక్రీ, ప్రదీప్, అవినాష్, అన్వేష్, చక్రపాణి, కవిత, సుమన్, రాకేష్ పాల్గొన్నారు.

పెర్కిట్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో బోనాల పండుగ సంబురాలు ఘనంగా జరిగింది. విద్యార్థిని విద్యార్థులు అమ్మవారు, పోతరాజు వేశధారణతో అలరించారు. పాఠశాల యాజమాన్యం ప్రసాద, సాగర్ బోనాల విశిష్ఠత గురించి తెలియజేశారు. జంటిల్ కిడ్స్ పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాడెంట్ ప్రకాశ్, ప్రిన్సిపాల్ లత పాల్గొన్నారు.

ఉర్దూఘర్ ఆవరణలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

● పోలీసుల భారీ బందోబస్తు



మడిగెలను కూల్చివేస్తున్న దృశ్యం

బోధన్,జూలై19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉర్దూఘర్ ఆవరణలో గతంలో అక్రమంగా నిర్మించిన రెండు మడిగెలను శనివారం మున్సిపల్ సిబ్బంది పోలీసుల సహకారంతో కూల్చివేశారు. ఇటీవల ఉర్దూఘర్ నూతన కమిటీ నియామకం తర్వాత షాదీఖానాకు ఇబ్బందులు అవుతున్నాయని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా గ్రీన్‌బెల్ట్‌లో ఈ మడిగెలు ఉన్నాయని మున్సిపల్ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. శనివారం మున్సిపల్ యంత్రాంగం పోలీసుల భారీ బందోబస్తు మధ్య మడిగెలను కూల్చివేశారు. మడిగెలలో ఉన్న సిమెంట్ సంచులతో పాటు దుకాణంలోని సామాన్లను ఖాళీ చేయించారు. అనంతరం పోలీసుల భారీ బందోబస్తు మధ్య అక్రమంగా నిర్మాణం చేసిన గ్రీన్ బెల్ట్‌లో ఉన్న రెండు మడిగెలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఉర్దూఘర్ కమిటీ అధ్యక్షులు బ్యాటరీ బాబా మాట్లాడుతూ తమ కమిటీ నియామకం అయిన తర్వాత షాదీఖానాకు ఇబ్బందిగా ఉన్న మడిగెలను తొలగించాలని ఎమ్మెల్యేతో పాటు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌ను విన్నవించామన్నారు. వారి ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్‌తో పాటు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. శనివారం వాటిని కూల్చివేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ సహకారంతో ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా ఉర్దూఘర్‌ను తీర్చిదిద్దుతామన్నారు.

హెల్త్‌సబ్‌సెంటర్ నిర్మాణానికి స్థలం అందించాలి

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో



స్థలాన్ని పరిశీలిస్తున్న బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

కోటగిరి,జూలై19(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థలం అందించేందుకు గ్రామస్థులు సహకరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. పొతంగల్ మండల కేంద్రంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి పలు స్థలాలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. పాత పొతంగల్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో కొంత స్థలం ఖాళీ ఉండగా అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తామన్నారు. అందుకు కొందరు వ్యతిరేకించారు. సొంత స్థలంలో ప్రభుత్వ భవనాన్ని ఎలా నిర్మిస్తారని సబ్ కలెక్టర్‌ను ప్రశ్నించారు. అనంతరం 171సర్వే నెంబర్‌లో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. గుట్ట ప్రాంతంలో సబ్ సెంటర్ నిర్మించడం సరికాదని గ్రామం మధ్యలో నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని మరి కొందరు వివరించారు. గ్రామస్థులు అనువైన స్థలాన్ని గుర్తించి తమకు అప్పగించాలని లేనిపక్షంలో సబ్ సెంటర్ రద్దు చేసే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో చందర్, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్ తదితరులున్నారు.

సుంకెట్‌లో 'ఇందిరమ్మ' ఇసుక లొల్లి

మోర్తాడ్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక సరఫరా కోసం తహసీల్దార్ సుంకెట్ గ్రామ శివారులోని పెద్దవాగు నుండి ఇసుక తెచ్చుకునేందుకు అనుమతిని ఇచ్చారు. శనివారం ఉదయం లబ్ధిదారులు ట్రాక్టర్లను తీసుకొని పెద్దవాగులోకి వెళ్లి కూలీలతో ఇసుకను నింపుకున్నారు. కాని సుంకెట్ వీడీసీ సభ్యులు, గ్రామస్థులు వచ్చి ట్రాక్టర్ల నుంచి ఇసుకను బలవంతంగా తీసివేయించారు. తహసీల్దార్ కృష్ణ, ఎస్సై రాము మాట్లాడిన ఫలితం లేకుండా పోయింది. దీంతో మండల అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాగునీటిని విడుదల చేయాలని నిరసన



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవీపేట, జూలై19 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి డీ50 ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ శనివారం మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి డీ50ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని అందించాలని వారు డిమాండ్ చేశారు. అంతకు ముందు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. అలాగే మండలంలోని నిజాంపూర్ ఎత్తిపోతల పథకంకు సంబంధించినట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల చోరీకి గురి కాగా సాగునీటి సౌకర్యం లేకుండా పోయిందన్నారు. తగిన న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, భోజన్న, రాజేందర్ గౌడ్, భూషణ్, శ్రీకాంత్, కోరే గంగాధర్, ఆనంద్, శ్రీనివాస్ గౌడ్, గణేష్, ప్రవీణ్, రాజశేఖర్, రాము, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



ఏర్గట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, జులై 19 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని శనివారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్సై పడాల రాజేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమదేవరెడ్డి మాట్లాడుతూ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే స్థానంలో ఉండి ఏకవచనంతో మాట్లాడం సరికాదని, సీఎం రేవంత్ రెడ్డి పట్ల అసభ్యకరంగా మాట్లాడిన కేటీఆర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అభివృద్ధి సంక్షేమ పథకాల అమలును ఓర్చుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడతున్నారన్నారు. కార్యక్రమంలో పన్నాల నర్సారెడ్డి, బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, గడ్డం జీవన్, మునిమాణిక్యం అజయ్, దండెవోయిన సాయి కుమార్, మేకల సాయన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కోటగిరి,జూలై19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రుద్రూర్ ట్రాన్స్‌కో ఏడీఈ నగేష్ కుమార్ సూచించారు. పొతంగల్ మండలంలోని కల్లూర్ సబ్ స్టేషన్‌లో శనివారం విద్యుత్ ప్రమాదాల నివారణపై కరపత్రాలు ఆవిష్కరించడంతో పాటు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పొతంగల్ ఏఈ ఫక్రోద్దీన్, ఎంఈవో శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్ బంజారా కార్యవర్గం ఎన్నిక

కోటగిరి,జూలై19(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల బంజారా సంఘం కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అధ్యక్షతన ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్షులుగా శేషరావు, ప్రధాన కార్యదర్శిగా దేవిసింగ్, ఉపాధ్యక్షులుగా యశ్వంత్ నాయక్, బాబు రావు, కిషన్, కోశాధికారిగా భీమాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు రవి రాథోడ్, గంగారాం, బలరాం, జయరాం, సంగ్రామ్, రాజు, బాలాజీ, దేవిసింగ్ పాల్గొన్నారు.

కస్తూర్బాలో భారత రాజ్యాంగంపై అవగాహన

కమ్మర్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని కస్తూర్బా బాలిక విద్యాలయంలో శనివారం జనవిజ్ఞన వేదిక తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై 10వ తరగతి విద్యార్థినులకు రాష్ట్ర అధ్యక్షులు నర్ర రామారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనిస్, రంజీత్, పాఠశాల ప్రత్యేక అధికారిని పాల్గొన్నారు.

మాల సంఘం భవనాన్ని కూల్చవద్దని వినతి

ఆర్మూర్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని యోగేశ్వర్ కాలనీలో మాల సంఘ భవనాన్ని కూల్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, అలాంటి చర్యలను నిలిపి వేయించాలని కోరుతూ కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్‌స్వామికి ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మూగ ప్రభాకర్, పులి గంగాధర్, నాగేష్‌లు వినతి పత్రం అందజేశారు. అంగిరి ప్రదీప్, శెట్‌పల్లి నారాయణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆర్మూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిప్రి, మగ్గిడి, ఇస్సాపల్లి, కోమన్‌పల్లి గ్రామాలలో శనివారం జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్, ఇట్టెం జీవన్, మండల పార్టీ అధ్యక్షుడు చొరకంటి చిన్నారెడ్డి, పిప్రి మాజీ సర్పంచ్ జీవన్‌రెడ్డి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, అమృత్‌రావు, శ్రీకాంత్, మంథని చిన్నారెడ్డి, మోహన్, మహేందర్, నాగరాజుర, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

ఆర్మూర్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్యను శనివారం నిజామాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ భవనంలో మాజీ సంఘాల యునిటైడ్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న మర్యాద పూర్వకంగా కలిసి శాలువ, పుష్ప గుచ్చంతో సన్మానించారు. కార్యక్రమంలో భవానిరెడ్డి, శీను, సరిత, గోపి, తదితరులు పాల్గొన్నారు.



బస్సు, లారీ ఢీ.. పలువురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన లారీ

లింగంపేట, జుల 19 (ఆంధ్రజ్యోతి) : కేకేవై ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై మండలంలోని ఎల్లమ్మ తండా వద్ద శనివారం ఆర్టీసీ బస్సు, లారి ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో పలువురికి స్వల్పగాయాలు కాగా లారీడ్రైవర్‌కు కాలు విరగగా, బస్సు డ్రైవర్‌తో పాటు 10 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. రహదారిపై మూల మలుపు వద్ద ప్రమాదకరమైన ఇరుకు బ్రిడ్జీ కారణంగా ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. బస్సు నిజాంసాగర్ నుంచి కామారెడ్డికి వెళుతుండగా లారీ కామారెడ్డి నుంచి లింగంపేట వైపునకు వస్తుంది. బస్సు, లారి ఎల్లామ్మతండా సమీపంలో బ్రిడ్జీపై ఎదురు ఎదురగా ఢీ కొన్నట్లు ప్రత్యేక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంలో లారి డ్రైవర్ బద్ద నాగరాజుకు కాలు విరిగిపోయింది. బస్సులోని డ్రైవర్ శ్రావణ్‌తో పాటు 9మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిని కామారెడ్డి, సదాశివనగర్, రాజంపేట, దోమకొండ మండలాలకు చెందిన 108వాహనాలలో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 102మంది ప్రయాణికులు ఉన్నారని కండక్టర్ శంకర్‌రావు తెలిపారు. ప్రమాద విషయం తెలియగానె లింగంపేట ఎస్సై దీపక్‌కుమార్, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావులు సంఘటన స్థలానికి చేరుకుని సహయక చర్యలు చేపట్టారు. బ్రిడ్జీపై ఉన్న లారిని జేసీబీ సహయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

చికిత్స పొందుతు హసాకొత్తూర్ యువకుడి మృతి

కమ్మర్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హసాకొత్తూర్ మారుతినగర్ వడ్డకాలనికి చెందిన ఇరగదిండ్ల శంకర్ (27) అనే యువకుడు శుక్రవారం రాత్రి రోడ్డుప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందతూ శనివారం మరణించినట్లు కమ్మర్‌పల్లి ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. హసాకొత్తూర్ నుంచి శుక్రవారం రాత్రి బైక్‌పై కమ్మర్‌పల్లి వైపు వస్తుండగా శుక్రవారం దేవి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు, ఎడమచేతికి, ఎడమ కాలికి తీవ్రగాయాలయ్యాయని, మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. భార్య పిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య కొడుకు ఉన్నారు.

మదన్‌పల్లిలో ఒకరికి డెంగి పాజిటివ్

మాక్లూర్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామంలో ఒకరికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయింది. సమాచారాం తెలుసుకున్న అధికారులు, ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో బ్రహ్మానందం గ్రామాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.

యువకుడి మృతి

బాన్సువాడటౌన్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన బాబయ్య (27) అనే యువకుడు శనివారం మృతిచెందాడు. అయితే శుక్రవారం సాయంత్రం బాన్సువాడ ఆస్పత్రిలో చేరినట్లు కుటంబు సభ్యులు తెలుపగా , శనివారం రోజు ఓపీ పేషెంట్‌గా వచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సరైన సమయంలో వైద్యం అందకపోవడంతోనే బాబయ్య మృతి చెందాడని బంధువులు ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోలీసు వాహనాల బందోబస్తు మధ్య ఇబ్రీంపేట్ గ్రామానికి తరలించారు.

చింతమన్‌పల్లిలో దాడి చేసి రూ.28 వేలు చోరీ

కామారెడ్డిటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి దోమకొండ మండలం చింతమన్‌పల్లికి చెందిన చిన్నగంగయ్య వద్ద రూ.28 వేలను లాక్కెళ్లినట్లు పట్టణసీఐ నరహరి తెలిపారు. కామారెడ్డి వీక్లిమార్కెట్ సమీపంలో గల దుబ్బగౌడ్ కల్లుదుకాణంలోకి గంగయ్య వెళ్లగా అక్కడికి ఇద్దరు ఆడవాళ్లు వచ్చి చిన్నగంగయ్యను కలిసి మాటలు కలిపారు. ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించారు. దీంతో గంగయ్య చింతమాన్‌పల్లికి వెళ్తున్నట్లు తెలుపడంతో అందులోని ఒక మహిళ తాను చింతమాన్‌పల్లి వైపు వస్తానని తను దించేయాలని కోరింది. దీంతో ఆమెను ఎక్కించుకుని వెళ్తు మార్గ మాధ్యలో హరిజనవాడ కల్లుదుకాణంలో చిన్నగంగయ్య తాను కల్లుతాగుతానని చెప్పి లోపలికి వెళ్లి కల్లుతాగిన అనంతరం తిరిగి ప్రయాణమయ్యారు. కొద్దిదూరం వెళ్లాక చిన్నగంగయ్యను బండి ఆపమని మహిళ చెప్పడంతో ఆపాడు. దీంతో ఇద్దరు మగవ్యక్తులు చిన్నగంగయ్య దగ్గరకు వచ్చారు. అందులో ఓ వ్యక్తి తన భార్యను బండిపై ఎందుకు ఎక్కిందని ప్రశ్నించి నీకు నా భార్యకు సంబంధం ఏమి ఉందని బెదిరించి గంగయ్య వద్ద ఉన్న రూ.28 వేలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శనివారం చిన్నగంగయ్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ

సదాశివనగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలోని ధర్మారావుపేట్, మర్కల్ గ్రామాలలో గుర్తుతెలియని దుండగులు తాళం వేసి ఉన్న ఇళ్ల తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి కామారెడ్డి జిల్లా క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. అదనంగా సీసీఎస్ కామారెడ్డివారి సహకారంతో సీసీటీవీ ఫుటేజ్‌లు, ఇతర టెక్నికల్ అసిస్టెన్స్ సహాయం తీసుకుని కేసును ఛేదించే విధంగా చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఇతర గ్రామాలలో ఈ తరహా ఘటనలు పునారవృతం కాకుండా నివారించేందుకు తాళం వేసి ఇళ్లకు వెళ్లే వారు తమ విలువైనా వస్తువులను పొరుగు వారికైనా లేకపోతే తనతో తీసుకెళ్లాలనే సూచనలు పోలీసువాఖ తరుచూ గ్రామాల్లో చాటింపు వాట్సాప్ గ్రూపుల్లో ద్వారా తెలియజేసిన ప్రజలు అశ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. తాళం వేసి ఇంటిని దవలి వెళ్లే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

గంజాయి తాగుతున్న ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంజర గ్రామ శివారులో ముగ్గురు యువకులు గంజాయి తాగుతున్నట్లు సమాచారం రావడంతో వారిపై దాడి చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై సుష్మిత తెలిపారు. మత్తు పదార్థాలను సేవించడం నేరం అని అన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని గ్రామాల్లో యువకులకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్న యువకుల్లో మార్పు రాకపోవడం శోచనీయమని ఎస్సై పేర్కొన్నారు. మత్తు పదార్థాలను సేవించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయిని సేవిస్తున్న ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్ డివిజన్ ట్రాసా అధ్యక్షునిగా శ్రీకాంత్ ఎన్నిక



డివిజన్ ట్రాసా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్మూర్ డివిజన్ ట్రాసా అధ్యక్షుడిగా వేల్పూర్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ ఎన్నికయ్యారు. అలాగే వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం శ్రీకాంత్, స్వాతిలకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యాలయ సిబ్బంది కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ గోపాల్, బాల్కొండ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చరణ్, సాహెబ్‌పేట్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు జాగర్ల నవీన్, మండల మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, నాయకులు మహిపాల్, మల్లారెడ్డి ఉన్నారు.

స్టూడెంట్ కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం

నవీపేట,జూలై19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలోని ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల పాఠశాలలో జరిగిన స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలలో హెడ్ గర్ల్‌గా మహితా రెడ్డి, హెడ్ బాయ్‌గా శశాంక్‌తో పాటు పలు కమిటీల సభ్యులు ఎన్నిక కాగా శనివారం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, డైరెక్టర్ హర్షిత్ గౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్, సెంటర్ హెడ్ శ్రావణి ప్రియ పాల్గొన్నారు.

రాయకూర్‌లో విద్యుత్ శాఖ అధికారుల పొలంబాట

రుద్రూరు,జూలై19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయకూర్ గ్రామ రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ నగేష్ కుమార్ మాట్లాడుతూ రైతులు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ ఏఈ శ్రీనివాస్, సాబిల్ పాల్గొన్నారు.

డిజిటల్ బోధనలకు కోనాపూర్ పాఠశాల ఎంపిక

కమ్మర్‌పల్లి, జూలై 19: (ఆంధ్రజ్యోతి) ఖాన్ అకాడమి డిజిటల్ బోదనలకు కోనాపూర్ ఉన్నత పాఠశాల ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌడారపు రాంప్రసాద్ తెలిపారు. బోధన అనంతరం విద్యార్థులకు ముల్యాంకనం సైతం చేయవచ్చని డిజిటల్ తరగతుల ద్వార విద్యార్థులు విసుగుచెందకుండా పాఠలను నేర్చుకుంటారని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు ఖాన్ అకాడమీ ద్వార లెసన్ ప్లాన్‌లు, ప్రాజెక్టులు కూడ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలి : ఏవో శృతి

వేల్పూర్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పాం పంట సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారణి ఎస్.శృతి సూచించారు. శనివారం వేల్పూర్ మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన వనశాఖ అధికారి రాజాగౌడ్, విస్తరణ అధికారులు ఎస్.సాయిరామరాజు, ప్రీయూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయికిరణ్, క్లస్టర్ ప్రతినిధి తరుణ్ ఉన్నారు.

ఎడపల్లి : ఎడపల్లి మండలంలోని మంగల్ పాడ్ గ్రామంలోని చిట్యాల రాజేంధర్ ఆయిల్ ఫాం క్షేత్రంలో శనివారం రైతులకు క్షేత్ర స్థాయిలో మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్ ఫాం సాగు చేస్తున్న రైతు అనుభవాలను వివరించారు.

సైబర్‌నేరాల పై ప్రజలకు అవగాహన

వేల్పూర్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని సైబర్ నేరాల పట్ల ప్రజలు అన్ని విధాల అప్రమత్తంగా ఉండాలని వేల్పూర్ ఎస్సై సంజీవ్ సూచించారు. శనివారం వేల్పూర్‌లో ఎస్సై ఆధ్వర్యంలో సైబర్ పోలీసులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చైతన్య, శ్రావణ్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం పోరాటం'

జక్రాన్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం ఉద్యమానికైనా వెనుకాడేదిలేదని పీఆర్‌టీయు టీఎస్ ఎమ్మెల్సీ అధికార అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి రవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

కోటగిరి,జూలై19(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, వెంకటేశ్వర్ రెడ్డి, సుద్దులంలో ఉపాధ్యాయురాలు సుమలత, బీజేపీ నాయకులు నవీన్, రమేష్, ప్రకాష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నందిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు సిలెందర్ లింగం, సీనియర్ నాయకులు చింతల కిష్టగౌడ్, తమ్మల్లా దేవేందర్, తదితరులున్నారు.

క్రీడా దుస్తువుల పంపిణీ

మోర్తాడ్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం ఉన్నత పాఠశాలలో పాలెం గ్రామానికి చెందిన ఎనుగందుల సాయినాద్ రూ.30వేల విలువగల 35 జతల క్రీడా దుస్తువులను పంపిణీ చేశారు. సాయినాద్ తండ్రి ఎనుగందుల అశోక్ ఆధ్వర్యంలో దుస్తువులను అందజేశారు. సాయినాథ్ అమెరికాలో ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు వేణు గోపాల్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహేష్‌కుమార్, నర్సింహస్వామి, రాజేందర్, త్రివేణి, మమత, రాజేశ్వరి, లచ్చయ్య పాల్గొన్నారు.

తొర్లికొండలో పల్లకీసేవా

జక్రాన్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండలో శనివారం శ్రీ వెంకటేశ్వర్ స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రాసమ్ములు భక్తి శ్రద్దలతోజరుపుకున్నారు. స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదర్శన చేయించారు. మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్థిక సహాయం అందించిన ఎస్‌ఐ



వికలాంగుడికి సహాయం చేస్తున్న ఎస్‌ఐ

రుద్రూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు ఎస్‌ఐ సాయన్న మానవత్వాన్ని చాటుకున్నారు. బోధన్ నుంచి రుద్రూరు వైపు పోలీసు వాహనంలో వస్తున్న ఎస్‌ఐ సాయన్న ఓ వికలాంగుడిని తన భార్య వీల్‌చైర్‌పై నెట్టుకుంటూ తీసుకెళ్తుండడంతో చలించిపోయారు. భర్తకోసం భార్య పడుతున్న కష్టాన్ని చూసి ఎస్‌ఐ కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు.

గురుకులాల్లో భయం భయం

● ఆర్మూర్‌లో గురుకుల కళాశాల విద్యార్థి ఆత్మహత్యకు కారణాలేంటో?

నిజామాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిరుపేద విద్యార్థులకు వసతితో పాటు విద్యను అందించే గురుకులాలు ఇప్పుడు విద్యార్థుల ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలలో విద్యార్థుల ఆత్మహత్యలు ఒకవైపు కలకలం సృష్టిస్తుంటే శనివారం ఆర్మూర్‌లోని వేల్పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థి గడ్డం సంతోష్ ఆత్మహత్యకు పాల్పడడం గురుకులాలలో అసలు ఏం జరుగుతుందోననే భయాందోళనలో విద్యార్థులు ఉన్నారు. ఊరు చివరన గురుకులాలతో పాటు ప్రభుత్వ వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఉంటున్నాయి. వీటిలో కనీస అవసరాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సరైన రక్షణ చర్యలు లేకపోవడం భయం భయంగా విద్యార్థులు వసతి గృహాలలో ఉంటున్నారు. ఆర్మూర్‌లోని వేల్పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిజాంసాగర్ మండలం ఆరేపల్లికి చెందిన గడ్డం సంతోష్ శనివారం ఉదయం వ్యాయామం అనంతరం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వసతిగృహాలలో ఉన్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. వసతిగృహాలు, గురుకులాలు అంటేనే విద్యార్థులు భయపడే భయానక పరిస్థితులు ఉంటున్నాయి. ఈనెల 13న యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలో సంధ్య అనే విద్యార్థిని భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోగా ఈ నెల 15న రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ఆత్మహత్యలకు పాల్పడడం విద్యార్థులకు గురుకులాలు, వసతిగృహాలు అంటే భయం కలిగిస్తుంది.

గురుకులాలలో సమస్య ఏంటి?

ఇతర వసతిగృహాలతో పోలిస్తే గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడడం విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు కలిగిస్తుంది. గురుకులాలలో ఉన్న అస్తవ్యస్త పరిస్థితులే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడానికి కారణంగా తెలుస్తుంది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు సరైన భోజనంతో పాటు వైద్య సదుపాయాలు లేకపోవడం విద్యార్థుల్లో ఒకరకమైన భయాన్ని కలిగిస్తున్నట్లు తెలుస్తుంది. కొంత మంది తల్లిదండ్రులను వదిలి హాస్టళ్లలో ఉండలేక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ గురుకులాలలో సౌకర్యాలు లేకపోవడం అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలలోనే అంతంత మాత్రంగానే సౌకర్యాలు ఉండటం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఊరు చివరన ఉండే భవనాలలో బిక్కు బిక్కుమంటూ భయంగా ఒంటరిగా ఉండలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.

చదరంగంలో రాణిస్తున్న బుడతడు

» ఆన్‌లైన్‌లోనే చూసి నేర్చుకుంటున్న ఔత్సాహిక క్రీడాకారులు
» కోచ్‌లు లేకపోవడంతో చెస్‌కు ఆదరణ కరువు
» నేడు అంతర్జాతీయ చదరంగం దినోత్సవం

సుభాష్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జీవితమే ఒక చదరంగం అంటూ ఓ మహాకవి ప్రస్తావించడం వెనుక చదరంగం అంటే ఎంత తెలివిగా ఆడాలో తెలుపుతుంది. చెస్ ఆడడానికి మంచి ఏకాగ్రత, చురుకైన మెదడు. అద్భుత వ్యూహాలు, అంకిత భావం అవసరం. ఆటలో గెలవాలంటే ఎత్తులకు పై ఎత్తులు వేయడం తెలిసి ఉండాలి. అందుకే ఈ ఆటలో రాజసం ఉంటుంది. రాజకీయాల్లో సైతం చదరంగం ఆటలు తరచు వాడుతుంటారు. ఈ ఆటను సైతం రాజకీయ నాయకులు ఎక్కువగా ఇష్టపడతారు. జూలై 20న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ చదరంగం క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 1924లో అంతర్జాతీయ చెస్ సమైఖ్య స్థాపించారు. మొదటిసారి 1966లో అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. సుమారు 178 దేశాల్లో చెస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చదరంగం ట్రెండ్ నడుస్తుంది. దేశం నుంచి గూకేష్, ప్రజ్ఞానందలు ప్రపంచ స్థాయిలో పతకాలు సాధించడంతో చెస్‌వైపు మొగ్గుచూపుతున్నారు. భారత దేశంలో చెస్‌కు ఆదరణ తెచ్చింది మాత్రం విశ్వనాథ్ ఆనందేనని చెప్పవచ్చు. తొలి గ్రాండ్ మాస్టర్‌గా విశ్వనాథ్ ఆనంద్ చరిత్ర సృష్టించడంతో చాలా మంది ఔత్సాహిక క్రీడాకారులు చదరంగం క్రీడవైపు మొగ్గుచూపారు. అనంతరం కోనేరు హంపి, హారిక లాంటి ఎందరో క్రీడాకారులు గ్రాండ్ మాస్టర్‌లు సాధించారు. వీరిని రోల్‌మోడల్‌గా తీసుకుని గ్రామీణ స్థాయి క్రీడాకారులు సైతం చెస్ ఆటవైపు ఆదరణ పెంచుకుంటున్నారు.

భారతదేశం నుంచే చదరంగం ఆట మూలాలు

చదరంగం ఆట మూలాలు భారతదేశంలోనే ఉన్నట్లు చరిత్రలు చెబుతున్నాయి. గుప్తుల కాలంలో ఉత్తర భారత ఉపఖండంలో ఆడిన చతురంగ ఆటలో భాగంగానే చదరంగం మూలాలు ఉన్నాయని నమ్ముతారు. వివిధ దేశాల మధ్య వాణిజ్యం ప్రారంభమైనపుడు వర్తకులు భారత ఖండం ద్వారా పశ్చిమాన పర్షియా వరకు చదరంగం ఆటను వ్యాప్తింపజేశారు. అక్కడ ఈ ఆటను చత్రంగ్ లేదా షత్రంజ్ అనే పేరుతో పిలిచేవారు. చదరంగం ఆట 600దశాబ్దాల నాటి పర్షియన్ దేశంలో గుర్తించారు. దీనిని భారత ఉపఖండానికి చెందిన రాయబారి ద్వారా పర్షియన్ రాజు ఖోస్రో 1 కు బహుమతిగా అందించారు. కాలక్రమేనా ఇది ఐరోపా, రష్యాలలో ప్రజాదరణ పొందింది. ఈ క్రమంలో ఈ ఆట2వేల కంటే ఎక్కువ వేరియంట్‌లుగా రూపాంతరం చెంది ఈరోజు మనకు తెలిసిన ఆధునిక చెస్‌గా పరిణామం చెందింది.

చెస్ ఆడితే కలిగే ప్రయోజనాలు

చెస్ ఆడడం వల్ల మేథోశక్తి పెరుగుతుంది. అల్జిమర్ రాకుండా సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. మెదడుకు రెండువైపులా వ్యాయామం చేస్తుందని, సృజనాత్మకత పెంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. జ్ఞాపక శక్తి మెరుగు పడేలా చెస్ ఆట దోహదపడుతుంది. ఏకాగ్రతను ఒత్తిడిలో మెరుగ్గా, చురుగ్గా ఆలోచించేలా చేస్తుంది. చెస్ ఆడడంలో గెలుపు ఓటములు సహజమని నేర్పుతుంది.



చదరంగం ఆడుతున్న దృశ్యం (ఫైల్)



చెస్ ఆడుతున్న అభిజిత్

చెస్ ఆటలో దూసుకుపోతున్న అభిజిత్

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన 5వ తరగతి చదువుతున్న బుడతడు అభిజిత్ చెస్‌లో తన ప్రతిభను చాటుతున్నాడు. 5వ తరగతిలోనే అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాడు. ఇప్పటికే అనేక రాష్ట్రస్థాయి పోటీల్లో తన ప్రతిభను చాటుతూ జిల్లాకు మంచి పేరు తీసుకువస్తున్నాడు. నగరంలోని వీక్లిబజార్‌కు చెందిన సాయన్న, అనూజల పుత్రుడైన అభిజిత్ చెస్‌లో తన ప్రదర్శనను ఔరా అనిపిస్తున్నాడు. అండర్-11, అండర్-15 విభాగాల్లో సైతం తన ప్రతిభను చాటుతూ పతకాలను సాధిస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్‌లో చాంపియన్‌గా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తనకన్నా ఎక్కువ వయస్సు ఉన్న వారితో పోటీపడి గెలుపును కైవసం చేసుకుంటున్నాడు. ఇంకా కోచ్‌ల పర్యవేక్షణలో రాటుదేలితే జిల్లాకు మరిన్ని పతకాలు తీసుకురావచ్చని అభిజిత్ తల్లిదండ్రులు తెలుపుతున్నారు.

కోచ్‌లు లేకపోవడంతో చెస్ క్రీడకు ఆదరణ కరువు

నిజామాబాద్ జిల్లాలో చెస్ క్రీడకు ఆదరణ ఉన్నా కోచ్‌లు లేకపోవడంతో చెస్ క్రీడల పట్ల తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కొందరు క్రీడాకారులు సొంతంగా నేర్చుకున్న ఆటతోనే వివిధ పోటీల్లో పాల్గొని జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభను చాటుతున్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేసరికి వారు వారి ప్రత్యర్థి క్రీడాకారులు కోచ్‌ల పర్యవేక్షణలో ఆటలు ఆడడంతో వారిని ఎదురించలేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులకు ప్రతిసారి చుక్కెదురవుతుంది. జిల్లాలో కోచ్‌లు లేకపోవడం చెస్ క్రీడాకారుల శాపంగా మారుతుంది. ప్రతి క్రీడకు ప్రైవేట్‌గా, ప్రభుత్వ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు. చెస్‌కు మాత్రం లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఉన్న క్రీడాకారులు తమకు తెలిసిన ఎత్తులను నేర్చుకుని మిగతా వాటిని ఆన్‌లైన్ ద్వారా నేర్చుకుని కొందరు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. కోచ్‌ల కొరత జిల్లాలో తీవ్రంగా వేదిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెస్ ఆటకు కోచ్‌లను ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో ఉంది..

- (అభిజిత్, చెస్ క్రీడాకారుడు)

ఆన్‌లైన్‌లో చెస్ ఆటను నేర్చుకుంటున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఒకటో తరగతి నుంచే చెస్ ఆటను నేర్చుకుంటున్నాను. జిల్లాలో కోచ్‌లు లేకపోవడంతో ఆటను నేర్చుకోవడం ఇబ్బందిగా మారింది. ఇప్పటికే రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. కోచ్ ఉంటే మరిన్ని మెరుగైన ఫలితాలను సాధిస్తాను. గ్రాండ్ మాస్టర్‌గా ఎదగాలన్న ఆశయంతోనే ముందుకుసాగుతున్నాను.



అసోసియేషన్ ద్వారా చెస్ క్రీడాకారులను తయారు చేస్తున్నాం..

- (రమేష్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు)

చెస్ ఆటలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయి నుంచే చెస్‌ను నేర్చుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రైవేట్ పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చెస్ ప్రాముఖ్యతను వివరిస్తున్నాం. అన్ని విభాగాల్లో చెస్ క్రీడాపోటీలు నిర్వహించి రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనేలా కృషిచేస్తున్నాం. ప్రభుత్వం చెస్ క్రీడపై దృష్టిసారించి కోచ్‌లను నియమిస్తే జిల్లా నుంచి మరిన్ని మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.

ఫటా.. ఫట్...

సొసైటీని అభివృద్ధి చేయడమే లక్ష్యం

● బాబురావు, సొసైటీ కార్యదర్శి, జుక్కల్



ఆంధ్రజ్యోతి : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు సకాలంలో ఎరువులు పంపిణీ చేస్తున్నారా?

సొసైటీ కార్యదర్శి : రైతులు సాగు చేస్తున్న పంటలకు వారి అవసరాన్ని బట్టి ఎరువులను పంపిణీ చేస్తున్నాం. యూరియాకు డిమాండ్ ఎక్కువ ఉండటంతో ప్రతి రైతుకు రూ. 270 యూరియా విక్రయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రైతులకు పంట రుణాలు ఇస్తున్నారా?

సొసైటీ కార్యదర్శి : భూమి కలిగిన ప్రతి రైతుకు వారి పాస్ బుక్ ఆధారంగా భూమి విస్తీర్ణం బట్టి పంట రుణాలు ఇవ్వడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి : రుణాలు పొందిన రైతులకు పంట భీమా రైతు పేరు ఇన్సురెన్స్ చేస్తున్నారా?

సొసైటీ కార్యదర్శి : రుణాలు పొందిన రైతులకు వారి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల వయసున్న రైతులను గుర్తించి సొసైటీ ద్వారా ఇన్సురెన్స్ చేస్తున్నాం. రైతులు ఏమైనా ప్రమాదాలకు గురైతే ఇన్సురెన్స్ క్లైమ్ చేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి : భూమి కలిగిన రైతులకు ఎకరం పొలంకు పంట లోను ఎంత మంజూరు చేస్తున్నారు?

సొసైటీ కార్యదర్శి : రైతుల భూమి ఆధారంగా వారి పాస్ బుక్‌లో నమోదైన భూమిని బట్టి ఎకరం భూమికి రూ. 40 వేలు ఇవ్వడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంట రుణాలు ఇస్తున్నారా?

సొసైటీ కార్యదర్శి : కొత్త రైతులు సొసైటీని సంప్రదిస్తే పాస్ బుక్‌ను చూసి ఇతర బ్యాంకుల నుంచి నోడ్యూ సర్టిఫికెట్ ఇస్తే పంట రుణాలు ఇస్తాం.

● (జుక్కల్, ఆంధ్రజ్యోతి)

వరుణిడి కోసం ఎదురు చూపులు

● ఊరించి ఈసురుమనిపించిన వర్షాలు



వర్షాలు లేక ఎండుతున్న పంటలు

మద్నూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరుణిడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. వాన జాడ లేక ఆకాశం వంక చూస్తూ అల్లాడుతున్నారు. జూన్ మొదటి వారంలో వానలు మురిపించడంతో రైతులు ఎంతో సంబరపడిపోయి కంది, సోయా, పెసర, మినుము, వరి వంటి పంటలు వేసుకున్నారు. ఇటీవల పక్షం రోజుల క్రితం అంతంత మాత్రంగా పడిన వర్షాలు పంటకు బలం ఇవ్వకపోవడంతో వర్షాలు ఎప్పుడు కురుస్తాయో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలై మొదటి వారంలో భారీ వర్షాలు కురుస్తాయని ఎదురు చూసిన రైతులకు అంతంత మాత్రమే వర్షం కురియడం నిరాశ ఎదురైంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో వాన దేవతలకు జలాభిషేకాలు చేశారు. వానమ్మా... రావమ్మా అంటూ రైతులు ఆవశా ఎదురు చూస్తున్నారు.

● ఆందోళనలో రైతులు

ఉమ్మడి మద్నూర్ మండలంలో ఈ ఏడాది ఉమ్మడి మద్నూర్ మండలంలో సోయా 35 వేల ఎకరాలు, వరి 6,200, కందులు 5,200, పత్తి నాలుగు వేలు, మినుము 1550, పెసర 1250 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. ఈ ప్రాంతంలో ఎటువంటి నీటి వనరులు లేకపోగా రైతులు కేవలం వర్షాభావంపైనే ఆధారపడి సుమారు 55 వేల ఎకరాలలో వానాకాలం పంటలు సాగు చేశారు. అటువంటిది వరుణ దేవుడు ఊరించి ఉసురు మనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించి సమయానికి వర్షాలు కురిసినట్లయితే వేసిన పంటలు దిగుబడి వస్తాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మూల మలుపులు.. మృత్యు పిలుపులు

» ప్రమాదకరంగా మూల మలుపులు
» పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
» ఇటీవలే మూలమలుపు వద్ద ఆటో, బొలెరో ఢీ
» ప్రమాదంలో మృతి చెందిన నాందేడ్ వాసి ఉష



ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాందేడ్ వాసి ఉష

నసురుల్లాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాపకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలలో భాగంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్లు నిర్మించిన మూలమలుపులు మాత్రం ప్రమాదకరంగా మారాయి. నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బాన్సువాడ - నిజామాబాద్ ప్రధాన రహదారిపై అటవీ ప్రాంతంలో, ప్రయాణికులకు మూలమలుపులు ప్రమాదకరంగా మారుతున్నాయి. గతంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు విడిచిన సంఘటనలు సైతం ఉన్నాయి. రాత్రి సమయంలో కాని మధ్యాహ్నం సమయంలో మూల మలుపుల వద్ద దూరంగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కాగా మండల సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదని ఆరోపణలు సైతం ఇటీవలే నాందేడ్ నుంచి బాన్సువాడకు వస్తున్న ఆటో, బాన్సువాడ నుంచి వర్ని వెళ్తున్న బొలెరో మూలమలుపు వద్ద బొలెరో ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నాందేడ్ వాసి ఉష అక్కడికక్కడే మృతి చెందింది. కాగా ప్రధాన కూడళ్లలో, మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రయాణికులకు ప్రమాదాల నుంచి రక్షించాలని మండల ప్రయాణికులు వాపోతున్నారు.



నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారిపై మూలమలుపులు

● మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



నిజామాబాద్ - బాన్సువాడ ప్రధాన రహదారిపై గల మూల మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరుగకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ప్రమాదాల నుంచి రక్షణ ఉంటుంది.

- చంద్రం, నసురుల్లాబాద్

సిర్పూర్ పాఠశాలలో బోనాల పండుగ



సిర్పూర్ పాఠశాలలో బోనమెత్తిన విద్యార్థినులు

మోపాల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం బోనాల పండుగను విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పిల్లలందరూ వస్త్రధారణలతో చేతిలో బోనాలు ధరించి మంగళహారతులతో గ్రామంలో బోనాల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, అక్బర్ పాషా, వందన, ఆజాద్, శ్రీనివాస్, లలిత, కాసర్ల నరేష్, రాములు, అనురాధ, వసంత, తదితరులు పాల్గొన్నారు. అలాగే మంచిప్ప ప్రభుత్వ పాఠశాలలో కూడా బోనాల పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు.

స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ సిద్ధం

» బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

కామారెడ్డిటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగిన బీజేపీ సిద్ధంగా ఉంటుందని రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పార్టీ మద్దతునిచ్చే అభ్యర్థుల గెలుపుకు కృషిచేయాలని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ కమలం కైవసం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణతార,రాష్ట్రకార్యవర్గసభ్యుడు లక్ష్మారెడ్డి,బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్‌మోహన్ పాల్గొన్నారు.

పరిహాసంగా మారుతున్న ప్రజాధనం

● లక్షలు వెచ్చించినా నిరుపయోగం
● కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్న విమర్శలు

సదాశివనగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ప్రజా అవసరాల కోసం పథకాల రూపంలో ఖర్చు చేస్తున్న ధనం వృథాగా పోతుందనడానికి మండలంలో నిర్మించిన శ్మశానవాటికలే, క్రీడాపాంగణాలను చూస్తేనే ప్రజలకు అర్థమవుతుంది. గత ప్రభుత్వం గ్రామాలలో ప్రజలు చనిపోయిన వారి అంత్యక్రియలు జరపడానికి స్థలాలు లేకుండాఉండటంతో గ్రామాల్లో ఉన్న అసైన్మెంట్ భూములను గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఒక్కో గ్రామంలో రూ.13లక్షల వరకు మంజూరు చేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వైకుంఠధామాల పేరుతో నిర్మాణాలు చేపట్టారు. కొన్నిగ్రామాలలో స్థానిక సర్పంచ్‌లు, చిన్నాచితక కాంట్రాక్టర్లు, పార్టీ కార్యకర్తలు కలిసి నిర్మాణాలు చేపట్టారు. పనులు వేగంగా చేయాలని నిత్యం కాంట్రాక్టర్లను వేధింపులు చేసిన అధికారులు నిర్మించిన పనులలో నాణ్యత నిర్మించిన తర్వాత ఉపయోగంలో ఉన్నాయా లేదా అనే విషయాలను పూర్తిగా మరిచిపోవడంతో 80శాతం గ్రామాలలో నిర్మించిన శ్మశానవాటికలో వాటికి చేసిన ఖర్చు బూడిదలో పోసిన పన్నీరులా మిగిలిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలో 24గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.12.60లక్షల చొప్పున సుమారు రూ.3.5కోట్ల వరకు ఖర్చు చేశారు. నిర్మించిన స్మశానవాటికల వద్ద నీటి వసతి లేకపోవడం, కొన్ని చోట్ల అంత్యక్రియలకు శవాలను తీసుకెళ్లలేని పరిస్థితులు, తదితర కారణాల వలన 50శాతం శ్మశానవాటికలు వృథాగా పడి ఉన్నాయి. ఒక ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఇంకో ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల గత ప్రభుత్వంలో ఖర్చు చేసిన ప్రజాధనం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వృథా అవుతుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఏదీఏమైనప్పటికీ ఒక ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో చేపట్టిన పనులు వాటి ఉపయోగాలు ప్రభుత్వ ధనంతోనే ఖర్చు చేశారు కాబట్టి గత ప్రభుత్వాలలో దొర్లిన తప్పులను సరిచేసి వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రస్తుత ప్రభుత్వాలు కృషిచ ఏస్తే ప్రజలకు అనేక మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు



భిక్కనూరు జాతీయరహదారికి ఆనుకుని ఉన్న క్రీడాప్రాంగణం దుస్థితి



జనగామలో వైకుంఠధామం పరిస్థితి

మంచం పట్టిన కాల్పోల్ తండా గిరిజనులు

• ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు • తండాలో వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన అధికారులు

మోపాల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్పోల్ తండా గిరిజనులు డెంగ్యూ వ్యాధితో సుమారు 35మంది మంచం పట్టారు. గత మూడు నాలుగు రోజుల నుంచి ఒక్కొక్కరికి సంభవించిన ఈ వ్యాధి మిగతా వారికి కూడా సోకడంతో తాండాలో ఉన్న వారందరూ జ్వరాలతో వణికిపోతున్నారు. ఒకరొకరు తండాను వదిలేసి నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స కోసం వెళ్లారు. వర్షాకాలం ప్రారంభదశలోనే ఇంతపెద్ద ఎత్తున మందికి డెంగ్యూ సంభవించడంతో గిరిజనులు వణికిపోతున్నారు. చిన్న పిల్లల నుంచి మొదలుకొని మహిళలు, యువకులు, వృద్ధులకు వ్యాధి వ్యాపించడంతో ఆందోళన చెందుతున్నారు. ఉన్న తండాను వదిలి ఆసుపత్రికి రావడంతో తండా మూగబోయిందని ఆ ప్రాంత గిరిజనులు వివరించారు. ఈవ్యాధి ఇంత మందికి సోకడం ఇదే మొదటిసారి అని గిరిజనులు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు ఇటీవల గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అయినా కూడా కాల్పోల్ తండాలో ఒకేసారి ఇంతమందికి విషజ్వరాలు రావడంతో జిల్లాయంత్రాంగాన్ని కదిలించింది. చుట్టుపక్కలఉన్న గిరిజన తండావాసులు ఆ తండాకు వెళ్లడానికి జంకుతున్నారు. గ్రామంలో ఉన్న వారంతా విషజ్వరాలతో వణికి పోతున్నారని సమాచారం రావడంతో వారి బంధువులు ఆసుపత్రులకు వెళ్లి పరామర్శించుకుంటున్నారు. విషయం తెలిసిన జిల్లా వైద్య అధికారి రాజశ్రీ ఉన్న ఫలంగా శనివారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో అధికారులు హుటాహుటీన తండాకు వెళ్లి ప్రజలందరికీ వైద్యపరీక్షలను నిర్వహించారు. తండాలో ఇంటింటికీ తిరుగుతూ నీటినిల్వ ఉన్నచోట పారబోశారు. జ్వరాలు రాకుండా గిరిజనులకు జాగ్రత్తలను వివరించారు. జిల్లా వైద్య శాఖ అధికారి, మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లాసర్వేలెన్స్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ వెంకటేశ్, ముదక్‌పల్లి వైద్యాధికారులు అజ్మల్, డాక్టర్ ప్రత్యూష, సిబ్బంది వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తండావాసులు


వైద్యశిబిరాన్ని సేవలు అందిస్తున్న అధికారులు

హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

డిచ్‌పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ధర్మారం(బీ)లోని జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ వినయ్ కృష్ణరెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టోర్‌రూం, కిచెన్, డైనింగ్ పరిశీలించారు. నిల్వ ఉంచిన బియ్యం, పరిశీలించి పలు సూచనలు చేశారు. డైట్‌చార్జీలను పెంచుతూ అమలులోకి తెచ్చిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నరా లేదో అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేకంగా బోధించాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రిన్సిపాల్‌తో సమావేశమై ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. పర్యవేక్షణ అధికారి అందుబాటులో ఉండేలా చూడలన్నారు. మెనూ ప్రకారం రోజు ఉడకబెట్టిన కోడి కోడ్లు అందిస్తున్నారో లేదో అని కలెక్టర్ ప్రశ్నించారు. భోజనం తయారుకు ఉపయోగించే పదార్థాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవలన్నారు. సిబ్బంది అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్సీవో సత్యనాథ్ రెడ్డి, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఈనెల 25 నుంచి అథ్లెటిక్స్ ఎంపికలు

సుభాష్‌నగర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 26 తేదీల్లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్, రాజాగౌడ్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నాగారం రాజారాం స్టేడియంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 25న అండర్-8, 10, 12, 14, 16 బాల బాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 26న అండర్-18, 20 స్త్రీ, పురుషుల విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 2గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి డైరెక్ట్ ఎంట్రీ ఇవ్వబడదని తెలిపారు. మిగతా వివరాల కోసం 9989040776 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉపకార వేతనాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

సుభాష్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థిని విద్యార్థుల ఉపకార వేతనాల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రజిత తెలిపారు. ఫ్రెష్, రినివల్ ఉపకార వేతనాల కోసం జూలై 1 నుంచి నవంబర్ 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన జేడీఏ

సుభాష్‌నగర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కృత్రిమ కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యూరియా నిల్వలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎక్కువ ధరలకు అమ్మిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఆయనవెంట ఏడీఏ వీరస్వామి, మండల సవ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి, ఏఈవో చక్రపాణి ఉన్నారు.

సమయానుగుణంగా సమాన్లు జారీ చేయాలి: సీపీ

సుభాష్‌నగర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): కోర్టు డ్యూటీ అధికారులు ప్రతీ కేసులో సంబంధిత వ్యక్తులకు సమయానుగుణంగా ఈ-సమాన్స్ జారీ చేయాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు ఈ-సమాన్స్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-సమాన్స్ నిర్వహణపై పోలీస్ సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. పారదర్శకత వేగవంతమైన సేవలకై సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. సంబంధిత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వాడటంలో శిక్షణ తీసుకొని ప్రతి ఆదేశాన్ని రికార్డు చేయాలని సూచించారు. సంబంధిత అన్ని కోర్టుల నుంచి సమాన్స్ జారీ చేసిన వాటిని పోలీస్ స్టేషన్లలో డౌన్‌లోడ్ చేసుకొని ఆ సమాన్స్‌ను త్వరితగతిన సర్వ్ చేయాలని తెలిపారు. శిక్షణను సిబ్బంది సద్వినియోగం చేసుకొని శిక్షణ పూర్తయిన అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు ఈశిక్షణపై క్షుణ్ణంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ బస్వారెడ్డి, సీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ సతీష్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్యామ్‌కుమార్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని కోర్టుడ్యూటీ ఆఫీసర్లు, ఐటికోర్ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్ గణితం 2, జూనియర్ లెక్చరర్ బోటనీ2 (1 జనరల్, 1 జనరల్ మహిళ) ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను నేరుగా రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ కార్యాలయం మొదటి అంతస్తు నాగారంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

• వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన



ర్యాలీగా వస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాలు

సుభాష్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తులో ఆడుకోవద్దని, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోడ అనిల్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని వామపక్ష విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో శనివారం రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేలాదిమంది విద్యార్థుల సర్టిఫికెట్‌లు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల మెమోలు రాకపోవడంతో, ప్రైవేట్ యజమాన్యాలు ఫీజుకడితే సర్టిఫికెట్‌లు ఇస్తామని చెప్పడంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో విద్యా మంత్రిని కేటాయించకపోవడం విచారకరమన్నారు. అసెంబ్లీలో విద్యారంగంపై చర్చలేకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయకుండా అసెంబ్లీలో చట్టంతేవాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. జూలై 23న జరగనున్న విద్యాసంస్థల బంద్ ద్వారా విద్యార్థుల శక్తిని చూపించడమే మాకున్న మార్గమని అన్నారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రాచకొండ విఘ్నేష్, కర్క గణేష్, జన్నారపు రాజేశ్వర్, రాజశేఖర్, నాగరాజు, సతీష్, గోపాల్‌సింగ్ ఠాకూర్, ప్రిన్స్, దినేష్, సాయికృష్ణ, సృజన్, శివ, గణేష్, తదితరులు ఉన్నారు.

వరుణా కరుణించవా!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయని రైతులు అంటున్నారు. మరో రెండు మూడు రోజుల్లో వర్షాలు కురవకపోతే వేసిన పంటలు ఎండిపోక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎండిన వరి పంటలు

మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన అగ్గు సాగర్ తనకున్న మూడు ఎకరాల భూమిలో వరి పంట వేశారు. వర్షాలు లేకపోవడంతో దాదాపు 2ఎకరాల వరకు వరి ఎండిపోయింది. అదే గ్రామానికి చెందిన ఎల్క మల్లయ్య ఎకరంన్నర వరిపంట వేయగా.. వర్షాల్లే ఎకరం ఎండిపోయింది.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు

వర్షాలు సమృద్ధిగా కురవాలని నల్లవెల్లి గ్రామంలో కప్పతల్లి ఆటలను గ్రామస్థులు ఆడుతున్నారు. వీధులగుండా తిరుగుతూ వర్షాలు కురవాలని దేవున్ని కోరుకుంటూ పూజలుచేస్తే వర్షాలు కురుస్తాయని గ్రామస్థుల నమ్మకం.



దుక్కి దున్నినా పంట వేయలే: దామ సుమన్, రైతు, నల్లవెల్లి

నాకున్న మూడు ఎకరాలభూమిలో తుకం పోశాను. వర్షాలు పడితే పొలం వేస్తా. వర్షాల కోసం ఎదురు చూస్తున్నా. వానదేవడు కరుణించాలి. రైతులపై దయ చూపాలి.



వర్షాల కోసం ఎదురు చూస్తున్నా: సాగర్, రైతు, నల్లవెల్లి

మూడు ఎకరాల వరి పంట వేశాను. వర్షాలు కురవకపోవడంతో వరి బీటలు వారింది. దాదాపు రెండు ఎకరాల వరి ఎండిపోయే దశకు చేరింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి

(5వ పేజీ తరువాయి)

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలను ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వామ్యం చేస్తూ వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అంతకుముందు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్‌కు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్, సీపీ సాయిచైతన్యలు ఘనస్వాగతం పలికారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామర్తి గోపి

'ప్రభుత్వంపై అబద్ధాలు మాట్లాడితే ఊరుకోం'

సుభాష్‌నగర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి సలహాలు ఇస్తే తీసుకుంటామని, అబద్ధాలు మాట్లాడితే నిలదీస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రామర్తిగోపి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్రప్రధాన కార్యదర్శి వేణురాజ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పటికీ తామే అధికారంలో ఉన్నామనే భ్రమలో అహంకారపు పనులు చేస్తున్నారని అన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ఎన్‌ఆర్‌ఐ సెల్ ఏర్పాటుచేసి గల్ఫ్ బాధితులకు సహాయం అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కించపరచాలని ప్రశాంత్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వం గల్ఫ్ బాధితులకు సహాయం అందించడం లేదని మాట్లాడటంపై మండిపడ్డారు. తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని, లేదంటే గ్రామాల్లో తరిమికొడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు విక్కీయాదవ్, నగర మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రీతమ్, డీసీసీ డెలిగేట్ ప్రమోద్, శోభన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన

ధర్పల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక క్రమశిక్షణపై శనివారం ధర్పల్లి ఎస్‌బీఐ మేనేజర్ గంగాధర్ అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల డిగ్రీ కళాశాలలో అర్హులైన అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు న్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులలో అతిథి అధ్యాపక పోస్టుల కోసం సంబంధిత సబ్జెక్టులలో పీజీ చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇందల్వాయి, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి గ్రామంలో శనివారం 8మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2 లక్షల 29వేల 500 చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఒడ్డె రాజు, దామ సుమన్, గూండ్ల శ్రీనివాస్, నీరడి గంగాధర్, కుమారస్వామి, ఎడ్ల శ్రీనివాస్, పిన్నెం రాజన్న ఉన్నారు.

జీరో ఆక్సిడెంట్ లక్ష్యంలో భాగస్వాములు కావాలి

సుభాష్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీరో ఆక్సిడెంట్ లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలని నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు ప్రమాదరహితంగా ఉన్న విద్యుత్ తీగలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు, విరిగిన స్తంభాలు, రోడ్డుపై తక్కువ ఎత్తులో ఉన్న లైన్ క్రాసింగ్ తదితర ప్రమాదకరంగా ఉన్నటువంటి వాటిని గమనించి వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని కోరారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు సంప్రదించాలని కోరారు.

కార్మిక శాఖ జిల్లా విజిలెన్స్ సభ్యుడిగా మాణిక్‌రాజు

నిజామాబాద్ లీగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా న్యాయవాది మాణిక్‌రాజు నియమితులయ్యారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి, సీనియర్ న్యాయవాది బి. మాణిక్‌రాజును జిల్లా కార్మిక శాఖ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పలువురు న్యాయవాదులు రాజుకు అభినందనలు తెలియజేశారు.

కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులను అనుసరించడం అభినందనీయం

సుభాష్‌నగర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులను అనుసరించడం అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ అన్నారు. జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవ ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జనాభాను నియంత్రించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని మహిళలందరికీ అందించవచ్చన్నారు. రక్తహీనత, మాతాశిశు మరణాలు, పోషకార లోపాన్ని, నిరుద్యోగ సమస్యలను తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు దేవినాగేశ్వరి, తుకారాం రాథోడ్, సామ్రాట్ యాదవ్, సుప్రియ, రవీందర్, రాజేశ్వర్, వెంకటేశ్వర్లు, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల జారీకి మధ్యవర్తిత్వం వహిస్తే చర్యలు

సుభాష్‌నగర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులు జారీకి సహకరిస్తామని మధ్యవర్తిత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ ఆర్‌డీవో రాజేందర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో శనివారం నిజామాబాద్ డివిజన్ పరిధిలోని మీసేవా నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ మీసేవాలో ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టిక ప్రకారమే సేవలు అందించాలన్నారు. సమావేశంలో నిజామాబాద్ ఉత్తర మండల తహశీల్దార్ భూలోకం విజయ్‌కాంత్‌రావు, దక్షిణ తహశీల్దార్ జె.బాలరాజు, మీసేవా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

సిరికొండ, జూలై19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ ఏఈ అనూష లబ్ధిదారులను కోరారు. సిరికొండ మండలం ముషీర్‌నగర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి మోహన్, కారోబార్ మోతిసింగ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రేపు దాశరథి లలిత సినీ సంగీత విభావరి

నిజామాబాద్ కల్చరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): దాశరథి కృష్ణమాచార్య శతజయంతిని పురస్కరించుకొని సోమవారం లలిత సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్వరసౌరభం అధ్యక్షుడు అయాచితం నాగరాజ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత విభావరిని విజయవంతం చేయాలని కోరారు.

ల్యాబ్ లేకుండా పరిశోధనలు ఎలా?

విద్యా కమిషన్ చైర్మన్ ఎదుట వాపోయిన విద్యార్థులు

డిచ్‌పల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): కాన్వకేషన్ జరిగిన 48 గంటల తర్వాత టీయూలో సందర్శించిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఎదుట విద్యార్థులు, అధ్యాపకుల గగ్గోలపై ఆయన విస్మయం వ్యక్తంచేశారు. టీయూని సందర్శించిన ఆయన విద్యార్థులు ప్రజావాణి సందర్భంగా తమ బాధలు పంచుకున్నారు. ఈ విషయం ప్రజావాణి విషయం గోప్యంగా ఉంచడంపై విద్యార్థులు, కాంట్రాక్టు అధ్యాపకులు, విలేకర్ల ఎదుట వాపోయారు. తమకు బాలికల హాస్టల్ తరగతి గదులు సరిపోవడం లేదని, పలుమార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రం సమర్పించినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు వివరించారు. ఇటీవల 2వ స్నాతకోత్సవం జరిగిన మైదానంలోనే ఆడిటోరియం లేక ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వచ్చే కాన్వకేషన్ కన్న 1000మంది విద్యార్థులు కూర్చునేలా ఆడిటోరియం నిర్మించాలని కమిషన్‌కు వివరించారు. పీహెచ్‌డీ స్కాలర్‌కు వసతి గృహం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని తెలిపారు. న్యాయ కళాశాల విద్యార్థులకు ఐఏళ్ల ఇంటిగ్రెటెడ్ కోర్సు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాను విద్యార్థులు, కాంట్రాక్టు అధ్యాపకులు, పదోన్నతుల కోసం అడిగి విషయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చైర్మన్ ఆకునూరి మురళి హామీఇచ్చారు.

'కారు'లో నిస్తేజం!

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గంలోనూ మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అడపాదడపా కార్యక్రమాలకు హాజరవుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాలతోపాటు బాన్సువాడ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించిన మాజీ ప్రజాప్రతినిధులు మాత్రం హైదరాబాద్‌కే పరిమితం అవుతున్నారు. అప్పుడప్పుడు శుభకార్యాలయాలకు, పరామర్శలకు వస్తున్నా పార్టీ క్యాడర్‌కు మాత్రం అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. బాన్సువాడ నియోజకవర్గానికి బీఆర్‌ఎస్‌కి అక్కడ నాయకులు ఎవరూ లేక మాజీ ఎమ్మెల్యే గతంలో బాన్సువాడ నుంచి గెలిచిన బాజిరెడ్డిగోవర్ధన్ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

(5వ పేజీ తరువాయి)

కన్సల్టెంట్ అధ్యక్షులు డాక్టర్ గంగాకిషన్ మాట్లాడుతూ అకాడమిక్ కన్సల్టెంట్లందరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. టీయూ ఏర్పాటై 2 ద శాబ్దాలు గడుస్తున్నా మౌలిక వసతులు కరువయ్యాయని, ఇప్పటికైనా వసతులు కల్పించాలని యూనివర్సిటీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సాగర్‌నాయక్ ఆధ్వర్యంలో అకునూరి మురళికి వినతిపత్రం అందజేశారు. అలాగే టీయూలో ఇంజనీరింగ్ కోర్సులను తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో బా లికల హాస్టల్‌ను తక్షణమే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యు లు రాజ్‌కుమార్ అకునూరి మురళికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు శివప్రసాద్, జనార్ధన్, శివకుమార్, సందీవస్, రెహమాన్, భాస్కర్, పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, రాహుల్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీ అంటే ప్రశ్నించే గొంతు

(5వ పేజీ తరువాయి)

కార్మికుల పక్షాన నిలబడి ప్రశ్నించే గొంతుగా మారడంతో వెనక్కి తగ్గిందని అన్నారు. ప్రజాసంఘాల రూపకల్పన చేసిన పార్టీయే సీపీఐ అని అన్నారు. మార్క్సిజం సిద్ధాంతాల పునాధుల మీద ఏర్పడిన పార్టీ అని అన్నారు. దేశంలో 500 సంస్థానాలు ఏర్పడిన సమయంలో పార్టీ ద్వారా ఎన్నో పోరాటాలు చేసిన త్యాగధనులు పార్టీ మనదేనని అన్నారు. సీపీఐ నుంచి సీపీఐఎం, సీపీఐఎంఎల్ విడిపోయినా సిద్ధాంతం ఒక్కటేనని అన్నారు. యంత్రాలు లేని సమాజం రావాలని కావాలని, శ్రమకు తగ్గ ఫలితం రావాలని పోరాటం చేస్తున్నామని గుర్తుచేశారు. జిల్లా కార్యదర్శి సుధాకర్ జిల్లా రిపోర్టును ప్రవేశపెట్టడంతోపాటు కీలక విషయాలపై చర్చించి తీర్మానించి ఆమోదించారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.230	రూ.280	రూ. 300



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,900	రూ.91,300	రూ.1170

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సూపర్ మ్యాన్ (11.00, 7.55)
: ఎఫ్-1 ది మూవీ (1.50)
: జురాసిక్ వరల్డ్ (ఇంగ్లీష్) (5.05)
: జూనియర్ (10.45)

స్క్రీన్-2 : సైయ్యారా (హిందీ) (10.10, 1.20, 4.30, 7.40, 10.50)

స్క్రీన్-3 : జూనియర్ (11.00, 2.10, 7.30)
: స్మర్ఫ్స్ (ఇంగ్లీష్) (5.20)
: క్నోవాట్ యు డిడ్ లాస్ట్ సమ్మర్ (ఇంగ్లీష్ (10.40)

స్క్రీన్-4 : స్మర్ఫ్స్ (ఇంగ్లీష్) (11.35)
: మై బేబి (1.45, 7.20)
: కొత్తపల్లిలో ఒకప్పుడు (4.40, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : జూనియర్ (1.30, 4.30, 7.20, 10.00)

స్క్రీన్-2 : జూనియర్ (11.00)
: కొత్తపల్లిలో ఒకప్పుడు (1.50, 4.40, 10.30)
: మై బేబి (7.30)

స్క్రీన్-3 : కొత్తపల్లిలో ఒకప్పుడు (11.00, 7.30)
: మై బేబి (1.30)
: సూపర్ మ్యాన్ (4.30, 10.20)

దేవి : జూనియర్ (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : ఏం మాయ చేసావే (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : మై బేబి (11.15, 2.15, 6.15, 9.15)

లలితామహల్: కొత్తపల్లిలో ఒకప్పుడు (11.15, 2.15, 6.15, 9.15)

– నిజామాబాద్ అర్బన్